


"అమ్మా! నేను కాలేజీకి వెళ్తున్నాను" తల్లితో చెప్పి బ్యాగ్ భుజాన తగిలించుకుంది శృతి.

అన్యమనస్కంగా తల ఊపింది కళ్యాణి.

జోళ్ళు వేసుకోబోతున్న శృతి ఆగి వెనక్కి తల్లి దగ్గరికి వచ్చింది.

# అదే ప్రశ్న

"ఏంటమ్మా! అదోలా వున్నావు! ఒంట్లో బాగానే ఉందా? ఏదైనా ఉంటే చెప్పు...అవసరమైతే ఇంట్లోనే ఉంటాను. ఈరోజు ప్రత్యేకమైన క్లాసులేం లేవు" తల్లినుదుటి మీద చెయ్యి వేసి చూస్తూ అంది.

ఆ ఆప్యాయతకి కళ్ళు చెమర్చాయి కళ్యాణికి.

ఎంతయినా ఆడపిల్ల! పొద్దున్నే లేచి టిఫిన్ చేస్తే మొగుడూ, కొడుకూ డబ్బాలు పట్టుకుపోయారే తప్ప ఆమె డల్‌గా ఉందన్న విషయం కూడా గమనించలేదు.

అయినా ఇదేం అనారోగ్యం కాదుగా..తల్లులు ఒక్కోసారి డల్‌గా ఎందుకుంటారో వయస్సొచ్చిన ఆడపిల్లలకి అర్థం అవుతుంది. కారణం తెలియకపోయినా కనీసం అలా ఉన్నారని అర్థం అవుతుంది. వీళ్ళకి జ్ఞానం రాక మునుపు ఎన్నిసార్లు 'డల్‌గా ఉందో

శివల పద్మ

వారికేం తెలుసు?

ఎవరితో చెప్పాలి? అందరూ ఉన్న ఒంటరి ఎవరైనా ఉంటే అది ఇల్లాలు మాత్రమే.

"ఏం లేదురా..తెల్లారుఝామున మెలకువ వచ్చేయడం వలన కొద్దిగా బద్ధకంగా ఉందంతే..నువ్వు కాలేజీకి వెళ్ళు"

"ఆర్ యూ ష్యూర్"

ష్యూర్ అన్నట్టు మందహాసం చేసింది కళ్యాణి.

శృతి వెళ్ళిపోయింది.

తెల్లారు ఝామున మెలకువ రావడం అబద్ధం. రాత్రి భర్తకీ తనకీ జరిగిన సంభాషణ గుర్తుకి వచ్చి మనస్సు వికలం అయింది.

పెళ్ళయి పాతికేళ్ళు దాటుతోంది. ఏనాడూ భర్తనుంచి గౌరవం పొందింది లేదు. అనుక్షణం దాష్టీకం, అధికారం వాళ్ళ వాళ్ళందరి మధ్యా చులకనగా మాట్లాడడం - పరాయి వారి మధ్య కూడా అవమానించడం - ఇదే ఈ పాతికేళ్ళ సంసార జీవితం!

అతడి దృష్టిలో భార్య అంటే తన కట్టుబానిస. తన ఆస్తి, ఆమె మీద సర్వాధికారాలు తనవే.

ఏనాడు తలవంచి తాళి కట్టించుకుందో ఆనాటి నుండి కళ్యాణి అని ఎవరూ లేరు. వైకుంఠ రావు భార్య మాత్రమే ఉంది. కనుక ఆమెకి తన కంటూ ఒక ఆలోచన, భావన ఉండాల్సిన అవసరం లేదు. ఉన్న వాటికి విలువ ఇవ్వాల్సిన అవసరం అసలే లేదు. ఇదీ అతడి ధోరణి.


మధ్యతరగతి తండ్రి కష్టపడి తెచ్చిన సంబంధం ఇది. పెళ్ళి మాత్రమే చేసారు. అంతే. ఆ తర్వాత అల్లుడి గొంతెమ్మ కోరికలు వారు తీర్చలేకపోయారు. వైకుంఠ రావుకి కోపం వచ్చినప్పుడల్లా అత్తవారిని 'ముష్టివెధవలు' అనందే ఆ కోపం చల్లారేది కాదు.

కన్నవారిని అలా అంటుంటే మనస్సు విలవిల్లాడినా పౌరుషం ఉవ్వెత్తున లేచినా సమాధానం చెపితే రెచ్చిపోయి రాద్ధాంతం చేస్తాడని మౌనంగా ఆ అవమానాన్ని దిగమ్రింగేది తప్ప ఏమనేది కాదు.

పొరపాటున ఒక్కమాట నోటినుంచి వచ్చినా అత్తవారివైపు ఆరుతరాల వారు అతడి తిట్లకి బలయ్యేవారు.

సరే, సాధింపులు, వెక్కిరింతలూ, వెటకారాలు అన్నీ సహించింది ఆపైన వివాహేతర సంబంధాలు.

అధికారి స్థాయిలో ఉన్న అతడు తన అధికారాన్ని ఉపయోగించి ఉద్యోగానికి వచ్చే ప్రతి అమ్మాయినీ



నయానో భయానో లొంగదీస్కునే వాడు. గుడ్డిగా అతడిని నమ్మే తనకి చాలా ఆలస్యంగా ఈ విషయం తెలిసింది.అవమానంతో, బాధతో మనస్సు వెయ్యి ముక్కలైంది. ఒక్కసారి బాధని అణుచుకోలేక ఆ ప్రస్తావన తేస్తే,

"అవును. నిజమే..నేనలాగే ఉంటాను. నువ్వు భరించ లేకపోతే వెళ్ళిపో వచ్చు" ఇదీ అతడి సమాధానం!

కుళ్ళి కుళ్ళి ఏడ్చింది. తరువాత

ఎప్పుడు అతడు పక్కకి వచ్చినా విపరీతమైన అసహ్యం వేసేది. ఆ అసహ్యాన్ని అయిష్టాన్ని దిగమ్రింగి అతడితో సంసారం చేసింది.

కానీ నిన్న?

పెళ్ళికెదిగిన పిల్లలున్న ఈ వయస్సులో అతడి విపరీత ధోరణికి అంతులేకుండా పోయింది.

ఉద్యోగం కోసం వచ్చిన ఓ అమ్మాయిని - పెళ్ళి కుదిరిన ఆ అమ్మాయిని లేట్ అవర్స్ ఉంచి తన కేబిన్‌లో అసభ్యంగా ప్రవర్తించాడట.

ఆ అమ్మాయి తప్పించుకొని ఇంటికి ఫోన్ చేసి అనరాని మాటలంది.

"ఇన్నాళ్ళూ ఆడపిల్లలు పరువుకోసం ఆలోచించి మౌనంగా ఉండేవారు. నేనలా ఉండను. అతడిని తల ఎత్తుకోనివ్వకుండా చేస్తాను. దీనివలన నా పెళ్ళి చెడిపోయినా ఫర్వాలేదు. వీడిని మాత్రం క్షమించను" అని నిష్కర్షగా చెప్పింది.

ఆ ఫోన్ విషయం చెప్పగానే తనకే దిగ్భ్రాంతి కలిగేలా అంతెత్తున లేచాడు.

"ఎవరెవరో బజారు ఆడవాళ్ళు వచ్చి ఏదేదో వాగుతుంటే మొగుడిని సమర్థించుకోవడం కూడా చేతగాని పెళ్ళానివి నువ్వు. అది చెప్పగానే నన్ను నిలదీసేయాలని నేను తలవంచుకుని నీ ముందు నుంచుంటానని అనుకున్నావు. నువ్వు అదీ కలిసి ఏం చేయగలరే నన్ను? ఏం చేయగలరు? పరువు తీస్తుందట పరువు..దాని బాబుతో చెప్పుకోమను. దానికి జీవితంలో పెళ్ళికాకుండా నేనూ చేయగలను"

కళ్ళెర్ర చేసి ఉగ్రంగా తాండవం చేస్తున్న అతడిని చూసి నివ్వెరపోయింది తాను.

రాత్రంతా ఒంటరిగా ఏడుస్తూనే గడిపింది. ఉదయం లేచాక తన రొటీన్ తనకు తప్పదు. అతడు నిర్లజ్జగా తన పనులు పూర్తి చేసుకుని ఆఫీస్‌కి వెళ్ళిపోయాడు.

మనస్సంతా చెప్పలేనంత బాధగా ఉంది.

వైవాహిక జీవితం అంటేనే అసహ్యం పుడుతోంది.

## గెటప్ చేంజ్

గ్లామర్‌ని తెరపై ఆరేయడంలో బాగా పాపులరయిన ఛార్మి ఇటీవల విడుదలైన '16 డేస్'లో కూడా రొమాంటిక్ పోజులిచ్చింది. అయితే ఏదైనా శృతిమించితే బోర్ కొడుతుందనేది ఛార్మికి కూడా తెలుసు. అందుకనే ఇకపై కాస్త ఫ్యామిలీటైప్ పాత్రల్లో నటించాలని భావిస్తోందిట ఛార్మి. గ్లామర్‌ని ఒలికించడం కాస్త తగ్గించి కాస్త నిండుగా, హుందాగా వుండే పాత్రలు వస్తే చేయాలని ఆలోచిస్తోందిట. బాగానే వుంది గానీ మరి నిర్మాతలు అలాంటి పాత్రలతో ముందుకి రావాలిగా.



ఒంటరిగా కూర్చున్న కళ్యాణి కాలింగ్ బెల్ మ్రోగగానే ముఖం తుడుచుకుని లేచి వెళ్ళి తలుపు తీసింది.

ఎదురుగా పెదతండ్రి కొడుకు రామం.

"రారా అన్నయ్యా! వదినా పిల్లలూ ఎలా ఉన్నారు?"

"అందరూ బాగున్నారు. మా బావమరిది కొడుకు బెంగుళూరు నుంచి వచ్చాడే..మనం ఇదివరకు అనుకున్నట్లు ఓసారి శృతిని చూపిద్దాం" డైనింగ్ టేబుల్ కుర్చీ మీదే కూర్చుంటూ చెప్పాడు.

లోపలి నుంచి చల్లటి నీళ్ళు తెచ్చి అతడి ఎదురుగా టేబుల్ మీద పెట్టింది కళ్యాణి.

"నాదేముంది అన్నయ్యా! మీ బావగారితో మాట్లాడుదాం. ఆయన సరేనంటే వాళ్ళని ఒకసారి పిలుద్దాం" ఇన్నేళ్ళ జీవితంలో చెప్పుకుంటూ వచ్చిన సమాధానమే మరోసారి చెప్పింది.

"అది సరేలేవే..ఇంతకీ శృతి ఏమంటుంది?"

'నా బొంద..ఈ ఇంట్లో ఆడవాళ్ళు మాట్లాడడం కూడానా..' మనస్సులోనే అనుకుంది.

"దానికింకా నేనేం చెప్పలేదు. సంబంధం కుదిరినా చదువు అయ్యాకనే చేస్తే బాగుంటుందని నా కోరిక. పెళ్ళయ్యాక ఇక చదువు సాగదు. అంతా ఆ వచ్చేవాడి మీద ఆధారపడి ఉంటుంది" నిర్వేదంగా అంది.

"సునీల్ విషయంలో నీకా సందేహం అక్కర్లేదు. వాళ్ళింట్లో అందరూ చదువుకున్నవాళ్ళే. చదివించుతారు కూడాను..."

రామం సంబంధం తెచ్చిన ముహూర్తం ఏమిటోగానీ అమ్మాయి వాళ్ళకి నచ్చడం వెంటనే ముహూర్తాలు కూడా పెట్టేసుకోవడం అయిపోయాయి.

పెళ్ళికన్నా చదువు ముఖ్యం కాదు అని నిర్ణయించేసి ముహూర్తాలు పెట్టించేసాడు వైకుంఠరావు.

పెళ్ళి తర్వాత కూడా వారు చదివిస్తారని మేనమామ హామీ ఇవ్వడంతో పెళ్ళికి ఒప్పుకుంది శృతి.

అబ్బాయి అందంగా చలాకీగా ఉండడం, కుటుంబ సభ్యులు కూడా సంస్కారవంతుల్లాగే కన్పించడంతో కొంత సంతోషించింది కళ్యాణి.

అన్నమాట ప్రకారం శృతిచేత చదువు పూర్తి చేయించేసారు వాళ్ళు.

"జాబ్ సంగతి ఏం ఆలోచించావు?" ఓసారి ఫోన్లో అడిగింది కళ్యాణి.

"ఇంకా ఏం అనుకోలేదమ్మా! సునీల్ ఏమంటాడో చూడాలి" అంది శృతి.

"నీకంతా బాగానే ఉందిగా..ప్రాబ్లెమ్ ఏమీ లేదుగా?" ఆరాటంగా అడిగింది.

"బాగానే ఉందమ్మా. నువ్వేం వర్రీ అవకు. అత్తయ్యగారు కూడా బాగానే ఉంటారు. నేను కూడా వాళ్ళ అలవాట్లు తెలుసుకొని ఆ ప్రకారమే చేస్తున్నాను."

ఆరు నెలలు బాగానే నడిచింది.

అక్కడి నుంచే ప్రారంభమైంది ఇల్లాలుగా అసలు కథ.

ఉద్యోగం దగ్గర ప్రారంభమైంది వివాదం.

"ఏమైందే..వారం రోజులనుంచీ ఫోన్ లేదు. అంతా బాగానే ఉన్నారా?"

"ఆ..నేను తప్ప" నిస్సత్తువగా వచ్చింది శృతి గొంతు.

"ఏమైందే..ఏమిటి సమస్య?"

"దాన్ని సమస్య అనాలో జీవితం అనాలో అర్థం కావడం లేదు. ఇది ఇల్లు కాదు. ఒక రైల్వే ఫ్లాట్‌ఫామ్. ఏ రోజూ బయటినుంచి ఎవరో ఒకరు రాకుండా జరగదు. వచ్చేవారు ఒంటరిగా రారు. గుంపులుగా వస్తారు. నాకు తిండి తినడానికి కూడా తీరుబాటు ఉండదు. తిన్నావా లేదా అని అడిగేవారు కూడా లేరనుకో..

మా అత్తగారికేమో మోకాళ్ళ నెప్పులు. కదల్లేదు. వచ్చిన వారందరితో తీరుబడిగా కబుర్లు చెప్పడం తప్ప మరో పని చేయలేరు. నిజంగానే ఆవిడది జెన్యూన్ ప్రాబ్లెమ్. ఒప్పుకుంటాను. ఈ చుట్టాల తాకిడేంటో నాకర్థం కాదు.."

"ఇల్లన్నాక బంధువులు రాకుండా ఎలా ఉంటారే..నువ్వే ఎవరినైనా సహాయానికి పెట్టుకోవాలి గానీ..."

"అలా ఎవరూ దొరకడం లేదు. అయినా నేను మౌనంగా చేస్తూ ఉంటే ఇంట్లో వాళ్ళకి కూడా ఆ అవసరం కన్పించడం లేదు.

"సునీల్ ఏమంటాడు?"

"ఏమీ అనడు. తన దృష్టిలో ఇవన్నీ కోడలికి ఉండే సహజమైన బాధ్యతలు. ఎవరికైనా తప్పవు. అసలది డిస్కస్ చేయాల్సిన ఇష్యూనే కాదు.." అక్కసుగా అంది.

కళ్యాణికి ఏమనాలో తోచలేదు.

ఏది ఏమైనా పోనీ ఒకసారి చూసి వద్దామనిపించినా భర్త అనుమతిస్తాడో లేదో అన్న సంశయం.

అయినా అడిగింది.

"అదేదో నాలుగు వెధవ కబుర్లు చెప్పడం. నువ్వు బయల్దేరిపోవడం. సంసారం అన్నాక పని ఉండదా? మిమ్మల్ని సింహాసనం చేయించి కూర్చోపెట్టాలా? ఏం మా అమ్మా నాయనమ్మా ఇంటెడు చాకిరీ చేయలేదూ! మీరు చేస్తారా? ఇల్లాలి హోదా కావాలిగానీ పని మాత్రం వద్దు. అంతేగా? ఆడదాని జీవితమే మొగుడింట పని చేయడానికి. అది దానికి అర్థం అయ్యేలా చెప్పు" కటువుగా అన్నాడు వైకుంఠరావు.

ఎలాగో మొగుడిని బ్రతిమాలి రైలెక్కింది కళ్యాణి.

తల్లిని చూస్తూనే కన్నీరు తిరగ్గా నిగ్రహించుకుంటూ ఆహ్వానించింది శృతి.

మెరిసే బుగ్గలు నున్నని భుజాలతో ఆరోగ్యంగా ఉండే కూతురు చిక్కి నీరసంగా కన్పించేసరికి తల్లి మనస్సు తల్లడిల్లింది.

ఆమె వెళ్ళేసరికే ఇంటినిండా మనుష్యులున్నారు.

పెళ్ళినాటికి ఇప్పటికీ కుటుంబ సభ్యులలో కూడా మార్పు వచ్చినట్లనిపించింది కళ్యాణికి. వియ్యపురాలు ముక్తసరిగా పలకరించి ఊరుకుంది.


స్నానం చేసి టిఫిన్ చేసి కూర్చున్న శృతితో మాట్లాడేందుకు సమయం దొరకలేదు. రాత్రి తొమ్మిది వరకూ పని చేస్తూనే ఉందామె.

కళ్యాణికే ఆశ్చర్యం వేసింది. తమ దగ్గరున్నప్పుడు పదిసార్లుచెప్తేగానీ ఏ పనీ చేసేది కాదు.

రాత్రి కూర్చున్నప్పుడు నెమ్మదిగా చెప్పుకుంటూ వచ్చింది శృతి.

ఇన్నాళ్ళూ ఏమనలేదుగానీ ఇప్పుడిప్పుడే కట్నకానుకల గురించి దెప్పిపొడుపుగా మాట్లాడడం, పెళ్ళిలో పెట్టిన వాటి గురించి వ్యంగ్యంగా కామెంట్ చేయడం, అత్తగారు సాధింపుల పర్వం ప్రారంభించడం, ఆపైన ఎడతెగని పని, గుర్తింపులేని చాకిరీ.

ఈ మధ్యలో నెల తప్పడం, విశ్రాంతి లేని పనివలన అబార్షన్ అయిపోవడం.



అన్నీ నిర్వికారంగా చెప్తుంటే నిశ్చేష్టురాలై విన్నది కళ్యాణి. ఏం చెప్తుంది?

మళ్ళీ తన వివాహపు తొలిదినాలు పునరావృతమవుతుంటే నిస్సహాయంగా చూస్తూ ఉండిపోయింది.

అసలేం చెప్పాలి? ఇదేమైనా కొత్తా?

స్వేచ్ఛా స్వాతంత్ర్యం లేని జీవితం, ఓ గుర్తింపు ప్రశంస లేని పని. వ్యక్తిత్వం అనే వానితో సంబంధం లేని జీవితం.

సంసార రథానికి భార్యాభర్తలిద్దరూ చక్రాల్లాంటి వారని - ఇద్దరిదీ సమభాగమని, ఒకే జీవితాన్ని ఇద్దరు పంచుకున్నారని ఇవన్నీ కథల్లో మాటలు!

వాస్తవం అది కాదు. సంసారంలో సమభాగం అనేది లేదు.

"అసలు నాకు పెళ్ళి కావాలని నేనెప్పుడు అడిగానమ్మా!" కూతురి ప్రశ్నకి ఉలిక్కిపడింది కళ్యాణి.

"పెళ్ళి అయ్యాక జీవితం ఎలా ఉంటుందో నీకు తెలిసినప్పుడు, జీవితంలో ఈ అనుభవాలన్నీ నువ్వు చూసినప్పుడు, నన్ను మళ్ళీ ఆ ఊబిలోనికి ఎందుకు తోసావమ్మా!"

"ఒక్కసారంటే ఒక్కసారి నాతో ఎందుకు చెప్పలేదు? అప్పుడు నేనే నిర్ణయించుకునే దాన్నికదా!"

కళ్యాణి గుండెని కుదిపి వదిలిందా ప్రశ్న!

కొన్నేళ్ళ క్రితం - సరిగ్గా అదే ప్రశ్న తనూ అడిగింది తన తల్లిని.

జీవితం పట్ల ఎలాంటి ఎక్స్‌పెక్టేషన్స్ లేకుండా పెళ్ళవడమే వరం అనుకుని, మగవాడు దొరకడమే అదృష్టం అనుకుని తిట్లు దెబ్బలూ జీవితంలో ఒక భాగం అని అనుకుంటే సమస్యే లేదు.

ఎటొచ్చీ మనిషిగా పుట్టినందుకు ఇది కాదు జీవితం అని వ్యక్తిత్వం ఎదురుతిరుగుతుంటేనే జీవితానికీ వ్యక్తిత్వానికీ సంఘర్షణ!

అప్పుడే అడిగింది తనీ ప్రశ్న.

ఆ సమాధానం గుర్తుంది కనుకనే ఇన్నేళ్ళ తరువాత కూడా పేలవంగా అదే సమాధానం కళ్యాణి నోటినుంచి వచ్చింది.

"నీ జీవితం నా జీవితంలా ఉండదనుకున్నానమ్మా!"

☆

## మరో రెండేళ్ల తర్వాతే...

సైఫ్ అలీఖాన్‌తో తన పెళ్లి మరో రెండేళ్లు వాయిదా వేసింది కరీనా. ఎందుకంటే ప్రస్తుతం తన కెరీర్ మంచి ఊపు మీదుందని చెప్పే కరీనా, 'సినిమాలతో ఇంత బిజీగా వుంటూ పెళ్లి చేసుకోవడం నాకు ఇష్టంలేదు. అంతేకాదు, సైఫ్ కూడా తన సొంత చిత్రనిర్మాణ సంస్థ పనులతో బిజీగా వున్నాడు. అతడికీ తీరికలేదు. అందుకనే మరో రెండేళ్ల తర్వాతే మేం పెళ్లిచేసుకోవాలనుకుంటున్నాం' అంటోంది కరీనా. ప్రస్తుతం తామిద్దరం ఒకరి కోసం ఒకరం వున్నాం అనే ఫీలింగే తమకెంతో సంతోషాన్నిస్తోందిట.